ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.6 ; కనిష్ఠం 9.8
కామారెడ్డి జిల్లా వార్తలు
గురువారం 11 డిసెంబరు 2025





జిల్లాలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రారంభం కానుంది. కామారెడ్డి డివిజన్ పరిధిలోని కామారెడ్డి, భిక్కనూరు, దోమకొండ, బీబీపేట్, రామారెడ్డి, రాజంపేట్, సదాశివనగర్, మాచారెడ్డి, పాల్వంచ, తాడ్వాయి పది మండలాల్లో ఎన్నికలు జరుగనున్నాయి.

157 గ్రామ పంచాయతీలకు, 1,084 వార్డు స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. సర్పంచ్ స్థానాలకు 733 మంది అభ్యర్థులు బరిలో ఉండగా వార్డు స్థానాలకు 3,240 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. నేడు వీరందరి భవిత్యవం తేలనుంది. ఎన్నికల నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

బీబీపేట ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్‌కు తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్న అధికారులు, సిబ్బంది



నేడే పోలింగ్

మొదటి విడత ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో తరలిన నిర్వాహకులు
- 157 సర్పంచ్ స్థానాలకు ఎన్నికలు
- బరిలో ఉన్న 733 మంది సర్పంచ్ అభ్యర్థులు
- 1,457 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు
- తొలి విడత మొత్తం ఓట్లు 2,48,668
- ఎన్నికల విధుల్లో పాల్గొననున్న 1,848 పీవోలు, 2,501 ఓపీవోలు
- పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు
- 10 టీమ్‌ల స్ట్రైకింగ్ ఫోర్స్.. 3 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్
- నేడు పోలింగ్ జరిగే పది మండలాల్లో ప్రభుత్వ సెలవు



తాడ్వాయి ఎంపీడీవో కార్యాలయంలో రిపోర్టు చేస్తున్న ఎన్నికల సిబ్బంది



కామారెడ్డి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మొదటి విడత పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. గత వారం రోజులుగా పల్లెల్లో ప్రచారంతో హోరెత్తించిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ఓట్లు రాబట్టేందుకు దృష్టి సారించారు. మరోవైపు అధికార యంత్రాంగం పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. పోలింగ్ నిర్వహణకు సంబంధించి అధికారులు, సిబ్బంది ఆయా మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల వద్ద పోలింగ్ సామగ్రిని డిస్ట్రిబ్యూట్ చేశారు. పోలింగ్ విధుల్లో ఉండే అధికారులు, సిబ్బంది ఎంపీడీవో కార్యాలయంలో రిపోర్టు చేసి ఓటింగ్‌కు సంబంధించిన సామగ్రిని ఆయా గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సులతో పాటు పలు ప్రైవేటు స్కూల్ బస్సులను సమకూర్చారు. గురువారం కామారెడ్డి డివిజన్ పరిధిలోని 10 మండలాల్లోని ఆయా గ్రామ పంచాయతీలకు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓట్లు లెక్కించి గెలుపొందిన సర్పంచ్‌లను, వార్డు సభ్యులను, ఎన్నుకున్న ఉప సర్పంచ్‌లను ఎన్నికల అధికారులు ప్రకటిస్తారు. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. పోలింగ్ జరిగే ఆయా మండలాల్లో ప్రభుత్వం స్కూళ్లకు, ఇతర ప్రైవేటు సంస్థలకు సెలవు ప్రకటించింది.

157 సర్పంచ్ స్థానాలకు ఎన్నిక

జిల్లాలో పంచాయతీఎన్నికలను మూడు విడతల్లో నిర్వహిస్తున్నారు. మొదటి విడతలోని కామారెడ్డి డివిజన్ పరిధిలో గల 10 మండలాలకు గురువారం పోలింగ్ జరగనుంది.కామారెడ్డి, భిక్కనూరు, దోమకొండ, బీబీపేట్, రామారెడ్డి, రాజంపేట్, సదాశివనగర్, మాచారెడ్డి, పాల్వంచ, తాడ్వాయి మండలాల్లోని 157 గ్రామ పంచాయతీలకు, 1,084 వార్డు స్థానాలకు పోలింగ్ నిర్వహించనున్నారు. సర్పంచ్ స్థానాలకు 733 మంది అభ్యర్థులు బరిలో ఉండగా వార్డు స్థానాలకు 3,240 మంది అభ్యర్థులు పోటీ

- మిగతా 8లో



తాడ్వాయి ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎన్నికల నిర్వాహకులకు వివరాలు సేకరిస్తున్న దృశ్యం

మొదటి విడత ఎన్నికలు జరిగే స్థానాలు, పోలింగ్ కేంద్రాలు

మండలం	సర్పంచ్ స్థానాలు	వార్డులు	పురుషుల ఓట్లు	మహిళ ఓట్లు	మొత్తం
భిక్కనూరు	18	154	18,708	20,404	39,284
బీబీపేట్	10	84	10,003	10,802	20,899
దోమకొండ	9	82	11,548	12,918	24,557
కామారెడ్డి	14	107	8,824	8,980	17,925
మాచారెడ్డి	21	102	9,475	10,271	19,869
పాల్వంచ	11	89	8,016	9,098	17,214
రాజంపేట్	16	100	10,771	11,692	22,579
రామారెడ్డి	18	125	12,843	14,218	27,204
సదాశివనగర్	21	214	15,856	17,202	33,293
తాడ్వాయి	18	111	12,298	13,807	26,234
మొత్తం	156	1,168	1,18,342	1,29,392	2,49,058



రైల్వే బ్రిడ్జీలు మంజూరు చేయాలి

- ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి



కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినతి పత్రం అందజేస్తున్న కామారెడ్డి ఎమ్మెల్యే

కామారెడ్డి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలోని నాలుగు చోట్ల రోడ్డు ఓవర్ బ్రిడ్జి, ఫుటోవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి ఢిల్లీలో కలిసి బుధవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకొని స్నేహపూరి కాలనీ నుంచి కలెక్టర్ ఆఫీస్ రోడ్డు వరకు రైల్వేలైన్ మీదుగా రోడ్డు ఓవర్ బ్రిడ్జి, వికాస్ నగర్ కాలనీ నుంచి ఇస్లాంపూర వరకు రైల్వేలైన్ మీదుగా రోడ్డు ఓవర్ బ్రిడ్జి, పాత రాజంపేట రైల్వే గేటు వద్ద రోడ్డు ఓవర్ బ్రిడ్జి, ప్రియా టాకీస్ రోడ్డు నుంచి ఇందిరాచౌక్ వరకు రైల్వే స్టేషన్ మీదుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి మంజూరు చేయాలని మంత్రిని కోరారు. రైల్వే అధికారులను త్వరలో పరిశీలన చేపట్టాలని మంత్రి ఆదేశించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.



డీసీసీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి

బీసీలకు పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రంలో బుధవారం టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డిని బుధవారం డీసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బీసీలకు పెద్దపీట వేస్తుందని అన్నారు. అందులో భాగంగానే వెనుకబడిన ప్రాంతమైన జుక్కల్ నియోజకవర్గానికి చెందిన మల్లికార్జున్‌కు డీసీసీ పదవి కట్టబెట్టిందన్నారు. జిల్లాలో అన్ని ప్రాంతాల ముఖ్య నాయకులను, కార్యకర్తలను, అన్ని విభాగాల నాయకులను కలుపుకొని పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులు వ్యక్తి జీవితాన్ని గౌరవంగా, స్వేచ్ఛగా ఉంచుతాయి

- న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరి టి.నాగరాణి

కామారెడ్డి టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మానవ హక్కులు అనేవి వ్యక్తి జీవితాన్ని గౌరవంగా, స్వేచ్ఛగా ఉంచుతాయని న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరి టి.నాగరాణి అన్నారు. కామారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కామారెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా విజన్ జూనియర్ కాలేజీలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ మానవ హక్కులు అనేవి ప్రతీ మనిషికి లభ్యమయ్యే అమూల్యమైన హక్కులు అని, జీవితం, స్వేచ్ఛ, సమానత్వం, వ్యక్తి గౌరవం వంటి విలువలు ఈ హక్కుల మూలస్తంభాలు అని పేర్కొన్నారు. వ్యక్తి తన జీవితాన్ని గౌరవంగా, స్వేచ్ఛగా, (మిగతా 8లో..)

మూడవ విడత బరిలోని అభ్యర్థులు 3,251

- తేలిన మూడవ విడత అభ్యర్థుల లెక్క
- సర్పంచ్ స్థానాలకు 461 మంది
- వార్డు స్థానాలకు 2,790 మంది బరిలో ఉన్న అభ్యర్థులు

కామారెడ్డి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మూడవ విడత బరిలో నిలిచిన అభ్యర్థుల లెక్క తెలింది. సర్పంచ్, వార్డు స్థానాలకు 3,251 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ఇందులో సర్పంచ్ స్థానాలకు 461 మంది అభ్యర్థులు, వార్డు స్థానాలకు 2,790 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 26 సర్పంచ్ స్థానాలు, 449 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. బరిలో నిలిచిన అభ్యర్థులకు ఎన్నికల అధికారులు గుర్తులను కేటాయించారు. మూడవ విడత ప్రచారాన్ని బరిలో నిలిచిన అభ్యర్థులు ముమ్మరం చేయనున్నారు.


మూడవ విడత బరిలో నిలిచిన అభ్యర్థులు

మండలం	సర్పంచ్ స్థానం	బరిలో ఉన్నవారు	ఏకగ్రీవాలు	వార్డు స్థానాలు	బరిలో ఉన్నవారు	ఏకగ్రీవాలు
బాన్సువాడ	15	68	10	117	396	105
బిచ్కుంద	22	67	01	183	427	20
బీర్కూర్	12	37	01	97	224	17
డోంగ్లీ	12	39	01	96	249	20
జుక్కల్	25	77	05	171	463	99
మద్నూర్	20	69	01	139	403	50
నసురుల్లాబాద్	16	55	03	105	312	59
పెద్దకొడప్‌గల్	20	49	04	112	316	79
మొత్తం	142	461	26	1,020	2,790	449

పంచాయతీల్లో ఉప సర్పంచ్ కీలకమే!

- రిజర్వేషన్‌లు కలిసిరాని చోట ఫుల్ డిమాండ్
- చెక్ పవర్‌తో పాటు అధికారాలు ఉండడమే కారణం
- సర్పంచ్ అందుబాటులో లేక పోతే ఆ స్థానంలో పని చేసే అవకాశం

కామారెడ్డి టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవితో పాటు ఉప సర్పంచ్ స్థానంపై కూడా తీవ్ర చర్చ జరుగుతోంది. ఎన్నికల్లో అభ్యర్థులకు మద్దతు ఇస్తున్న ఆయా పార్టీలు ఒక సర్పంచ్ స్థానాన్ని మాత్రమే గెలుచుకోవడం వల్ల ప్రయోజనం లేదని ఉప సర్పంచ్ స్థానాన్ని కూడా దక్కించుకుంటే పరిపూర్ణమైన గెలుపు లభిస్తుందని భావిస్తున్నాయి. ఇందుకోసం ఉప సర్పంచ్ స్థానాలపై ప్రధానంగా గురిపెడుతున్నాయి. సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్‌ను కూడా కైవసం చేసుకోకపోతే పార్టీలు రాజకీయంగా ప్రతికూలతలను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఉపసర్పంచ్‌కు చెక్‌పవర్ ఉండడంతో ఈ పదవికి డిమాండ్‌ను పెంచింది. ఉప సర్పంచ్‌ను ఎన్నుకునేది వార్డు సభ్యులే అయినందున వార్డు సభ్యుల పదవులకు పోటీ తీవ్రంగా ఉంది. రాజకీయంగా పార్టీల నుంచి మద్దతు ఉన్న వారు వార్డు పదవుల్లో సైతం గట్టి పోటీ ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు.



వార్డు సభ్యులే కీలకం

ఎన్నికల్లో రిజర్వేషన్‌లు అనుకూలంగా రాని చోట్ల ఆయా పార్టీల నాయకులు వ్యూహాలు మార్చుకుంటున్నారు. సర్పంచ్ కాకపోయినా చెక్ పవర్ ఉన్న ఉప సర్పంచ్ పదవిని దక్కించుకుందామని పథకాలు రచించుకుంటున్నారు. సర్పంచ్ నుంచి వార్డు సభ్యుల వరకు అనువైన వారిని ఎంపిక చేసేందుకు నేతలు రాత్రింబవళ్లు సమాలోచనలు చేస్తున్నారు. ఉప సర్పంచ్ కావాలంటే వార్డు సభ్యులే కీలకం కానున్నారు. దీంతో చెప్పిన మాట వినేవారితోనే నామినేషన్ వేయించినట్లు సమాచారం. 50 శాతం సర్పంచ్ స్థానాలు మహిళలకు కేటాయించారు. మహిళ సర్పంచ్‌లు గెలిచిన పంచాయతీల్లో ఉప సర్పంచ్‌గా గెలుపొంది ఆధిపత్యం చెలాయించవచ్చనే ఉద్దేశ్యంతో పలుకుబడి కలిగిన నేతలు వార్డు సభ్యులుగా బరిలోకి దిగారు. పాలక వర్గ సమావేశాలకు సర్పంచ్ గైర్హాజరు అయితే ఉప సర్పంచ్ అధ్యక్షతనే నిర్వహిస్తారు.

ఎన్నికలు ఇలా..

మొదటి విడత సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ గురువారం మధ్యాహ్నం వరకు కొనసాగనుండగా ఫలితాలు (మిగతా 8లో..)



పోస్టల్ బ్యాలెట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించాలి

- సబ్ కలెక్టర్ కిరణ్మయి

పిట్లం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోస్టల్ బ్యాలెట్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని అధికారులకు బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో బ్యాలెట్ ఎన్నికల కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ కోసం ఏర్పాటు చేసిన సదుపాయాలు, సిబ్బంది నిర్వహణ, పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ నరేందర్, ఎంపీడీవో రఘు, ఎంపీవో నాగరాజు పాల్గొన్నారు.

వణికించే చలిలో.. సిరులిచ్చే కంది

- కంది పంటకు కలిసివస్తున్న చలి
- దిగుబడులు పెరుగుతాయని ఆశలు
- ఆనందంలో అన్నదాతలు

7



ఓట్ల పండక్కి.. పల్లెలు ముస్తాబు

- ఓటరు గడపలో అభ్యర్థుల సందడి
- ఓట్ల పండుగకు సిద్ధమవుతున్న ప్రజలు
- మూడవ విడతలో బాన్సువాడ ఎన్నికలు

7



సంక్షేమం దొంగలపాలు

- నిరుపయోగంగా కమ్మర్‌పల్లి బీసీ బాలుర వసతి గృహ భవనం
- తలుపులు, ఇతర సామగ్రి చోరీ
- పట్టింపులేని అధికారులు
- హెచ్చరిక బోర్డు ఏర్పాటుతో సరిపెట్టిన వైనం

6



ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా నిర్వహించాలి

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



దేవునిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

కామారెడ్డి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ ఆదేశించారు. బుధవారం కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ మొదటి విడత ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ సిబ్బందికి చేపట్టిన ఎన్నికల సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో మొత్తం 167 పంచాయతీలు ఉండగా 10 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కాగా మిగిలిన 157 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందు కు గాను 1,457 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేశామన్నారు. 1,848 పీవోలు, ఓపీవోలు 2501 విధులు నిర్వహించనున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారి అప్రమత్తంగా ఉంటూ ఎన్నికలను సజావుగా నిర్వహించాలని అన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో కావాల్సిన సామగ్రిని పోలింగ్ కేంద్రం వారీగా వేరు చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. బ్యాలెట్ పత్రాలు జాగ్రత్తగా చెక్ చేసి ప్యాక్ చేయాలని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రం చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను మరోసారి నిర్ధారణ చేసుకోవాలన్నారు.సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం కల్పించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా (మిగతా 8లో..)

జిల్లాలో పెరుగుతున్న కడుపుకోతలు

- ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో పెరుగుతున్న సిజేరియన్ ఆపరేషన్‌లు
- జిల్లాలో 10 నెలల్లో మొత్తం 7,722 డెలివరీలు
- విచ్చల విడిగా ఫీజు వసూలు
- అమలు కాని ఈ బర్త్ పోర్టల్
- దృష్టి సారించని వైద్యఆరోగ్యశాఖ

కామారెడ్డి టౌన్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): నవ మాసాలు మోసి, సుఖ ప్రసవం కావాల్సిన తల్లుల కడుపుపై ప్రైవేట్ ఆసుపత్రుల్లో కత్తెరగాట్లు పడుతున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు కాసులకు కక్కుర్తి పడి 80 శాతం వరకు సిజేరియన్ ఆపరేషన్‌లు చేసి విచ్చలవిడిగా ఫీజులు దండుకుంటున్నారు. సిజేరియన్ ఆపరేషన్లు అరికట్టేందుకు ప్రవేశపెట్టిన ఈ బర్త్ పోర్టల్ సైతం జిల్లాలో అమలు కావడంలేదు. ఇంత జరుగుతున్నా వైద్య ఆరోగ్యశాఖ దృష్టి సారించడం లేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రులతో పాటు పలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోని సిబ్బందికి అవగాహన సదస్సులు ఏర్పాటుచేసి అవసరం లేకున్నా సిజేరియన్‌లు చేస్తున్న ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటేనే మాతాశిశు మరణాలు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు తగ్గనున్నాయి.

పది నెలల్లో ప్రైవేట్‌లో నార్మల్ 419.. సిజేరియన్‌లు 2,318

జిల్లాలో ఒక జనరల్ ఆసుపత్రి, 6 కమ్యూనిటీ ఆసుపత్రులు, 23 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 80కు పైగా ప్రైవేట్ నర్సింగ్‌హోంలు, ఆసుపత్రులు ఉన్నాయి. జనవరి నుంచి అక్టోబరు వరకు జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో మొత్తం 7,722 డెలివరీలయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో 4,575 డెలివరీలు జరిగాయి. ఇందులో నార్మల్ డెలివరీలు 2,229 కాగా, సిజేరియన్ డెలివరీలు 2,346 ఉన్నాయి. ప్రైవేట్ ఆసుపత్రుల్లో 2,737 డెలివరీలు కాగా, ఇందులో నార్మల్ డెలివరీలు 419 కాగా, సిజేరియన్ డెలివరీలు 2,318 చేశారు. ఈ లెక్కలను పరిశీలిస్తేనే ఏ రకంగా ప్రైవేట్‌లో సిజేరియన్‌కు మొగ్గు చూపుతున్నారో అర్థం చేసుకోవచ్చు. ఆసుపత్రికి వచ్చిన తర్వాత నార్మల్ డెలివరీ చేస్తామని నమ్మబలికి (మిగతా 8లో..)



క్రైం సమాచారం

వ్యక్తి దారుణ హత్య

» సాగు భూమికి దారి విషయంలో తగాదానే కారణం


కోకట్ల సత్తయ్య

దోమకొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ భూమి వద్ద దారి(తోవ) విషయంలో ఒకరు హత్యకు గురైన ఘటన దోమకొండ మండలం బీబీపేట గ్రామ పరిధిలోని రాంరెడ్డిపల్లిలో మంగళవారం రాత్రి 11 గంటలకు చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. రాంరెడ్డిపల్లికి చెందిన కోకట్ల సత్తయ్య(50)వ్యవసాయం చేస్తున్నాడు. చాలా కాలంగా దారి విషయంలో పక్క పొలానికి చెందిన రైతులు కల్ల లచ్చయ్య, కల్ల దేవయ్యతో వివాదం నడుస్తోంది. అది మనసులో పెట్టుకున్న నిందితులు సమయం చూసుకుని మంగళవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చిన సత్తయ్యపై దాడి చేశారు. ముఖంపై బలమైన ఆయుధంతో కొట్టడంతో గాయపడిని సత్తయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. వెంటనే నిందితులలో ఒకరైన లచ్చయ్య బీబీపేట పోలీసులకు లొంగిపోయాడు. అనంతరం దేవయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

కాగా లచ్చయ్య, దేవయ్యలు తన భర్తను హత్య చేశారని భార్య లక్ష్మి అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సంపత్‌కుమార్ తెలిపారు. మృతుడు సత్తయ్యకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా గ్రామంలో బుధవారం ఉదయం నుంచే ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిందితుల ఇళ్ల ముందు హతుడి బంధువులు ఆందోళనకు దిగారు. సీఐ సంపత్ కుమార్ సిబ్బందితో గ్రామానికి చేరుకుని బంధువులను సముదాయించే ప్రయత్నం చేయగా వినకపోవడంతో ఉన్నాతాధికారులకు సమాచారం అందించారు. దీంతో ఏఎస్పీ చైతన్యరెడ్డి రాంరెడ్డిపల్లికి చేరుకున్నారు. ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబీలకు న్యాయం చేస్తామని ఏఎస్పీ హామీ ఇవ్వడంతో బంధువులు, కుటుంబ సభ్యులు శాంతించారు. గ్రామంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు దోమకొండ, బీబీపేట ఎస్ఐలు ప్రభాకర్, విజయ్ 30 మంది కానిస్టేబుళ్ల గ్రామంలో ముందస్తుగా బందోబస్తు నిర్వహించారు.

ఆటో బోల్తా.. విద్యార్థి దుర్మరణం

జుక్కల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓ ఆటో డ్రైవర్ అజాగ్రత్త ఓ విద్యార్థి నిండు ప్రాణాన్ని బలి తీసుకున్న ఘటన జుక్కల్ మండలం సావర్గం గ్రామంలో జరిగింది. జుక్కల్ ఎస్సై నవీన్ చంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. సావర్గం నుంచి కండె వల్లూరులోని ప్రభుత్వ పాఠశాలకు 15 మంది విద్యార్థులు ఆటోలో బయలుదేరారు. గ్రామ శివారులో డ్రైవర్ ఆటోను వేగంగా నడపడంతో ఆటో బోల్తాపడి పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో పదోతరగతి విద్యార్థి కాంబ్లి ప్రణవ్ (15) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో 14 మందికి తీవ్రగాయాలయ్యాయి. ప్రణవ్ అన్న సాయిప్రసాద్ కూడా అదే ఆటోలో ఉన్నాడు. అతనికి స్వల్ప గాయాలయ్యాయి. ఘటనాస్థలాన్ని తహసీల్దార్ మారుతి, ఆర్ఐ రామారావు, ఎంఈవో తిరుపతయ్య, సీఐ రవికుమార్, ఎస్సై నవీన్ చంద్ర పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ప్రణవ్ మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రణవ్ మృతదేహాన్ని చూసి కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ప్రణవ్ తండ్రి కొంతకాలం క్రితం మరణించగా.. తల్లి కూలీపనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తోంది.

విద్యుదాఘాతంతో రైతు..


అల్లాపురం లింగయ్య

నాగిరెడ్డిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లింగంపల్లి కలాన్‌కు చెందిన రైతు అల్లాపురం లింగయ్య(59) బుధవారం విద్యుత్‌షాక్ తగిలి మృతిచెందినట్లు ఇన్‌చార్జి ఎస్సై మనోహర్‌రావు తెలిపారు. వివరాలు.. లింగయ్య బుధవారం ఉదయం పొలం వద్ద వేసిన వరి తుకానికి నీరు అందించేందుకు వెళ్లారు. పందుల బెడద నుంచి పొలం కాపాడుకోవడానికి చుట్టిన వైరుకు ప్రమాదవశాత్తు విద్యుత్ సరఫరా జరిగి కరెంట్ షాక్ తగిలి లింగయ్య అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడి భార్య లస్మవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మహిళ మెడలో నుంచి చైన్ లాగుతున్న దుండగుడు, పారిపోతున్న దృశ్యం

నగరంలో చైన్ స్నాచింగ్

» మహిళ ముగ్గు వేస్తుండగా గొలుసు లాక్కొని పారిపోయిన దుండగులు

సుభాష్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ముగ్గువేస్తున్న మహిళ మెడలోంచి చైన్ దొంగతనం చేసిన ఘటన నగరంలో జరిగింది. నగరంలోని 4వ టౌన్ పోలీసుస్టేషన్ పరిధి వినాయక్‌నగర్‌లో బుధవారం తెల్లవారుజామున ఇంటిముందు స్వరూప అనే మహిళ ముగ్గువేస్తుంది. అడ్రస్ అడిగినట్లు మాటల్లో పెట్టి ఓ దుండగుడు ఆమె మెడలో ఉన్న చైన్‌ను లాక్కుని పరిగెత్తాడు. అంతకుముందే బైక్ ఆన్‌చేసిన మరోవ్యక్తితో కలిసి పరారయ్యారు. ఇదంతా సీసీ కెమెరాలో రికార్డయింది. బాధితులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో 4వ టౌన్ ఎస్‌హెచ్‌వో సతీష్ అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. సీసీ కెమెరాల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామన్నారు.

పోలీసు విధులకు ఆటంకం.. ముగ్గురిపై కేసు

సుభాష్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు 1వ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. మంగళవారం సాయంత్రం ట్రాఫిక్‌లో పనిచేస్తున్న రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ మాస వినోద్, సిబ్బందితో కలిసి డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న క్రమంలో మహారాష్ట్రకు చెందిన సంజయ్, చంద్రకాంత్, అజయ్ మద్యం తాగి కారు నడపగా.. వారిని చెక్‌చేయడానికి వెళ్లారు. ఈ క్రమంలో ముగ్గురు పోలీసులు సిబ్బందితో దుర్భాషలాడారు. కారులో తనిఖీలు చేయగా.. గంజాయి దొరకగా.. ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం, నగదు పట్టివేత

భిక్కనూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో మండలవ్యాప్తంగా ఫ్లయింగ్ స్క్వాడ్, పోలీసులు మంగళవారం రాత్రి నుంచి తనిఖీలు చేపట్టారు. మండలకేంద్రంలోని ఒక వార్డులో ప్లాస్టిక్ స్టూల్స్ పంచుతున్నారన్న సమాచారంతో అభ్యర్థి ఇంటి వద్ద స్టూళ్లను, నగదును, మరో సర్పంచ్ అభ్యర్థి తరఫున పంపిణీ చేస్తున్న మద్యం బాటిళ్లు, ఇంకో సర్పంచ్ అభ్యర్థి తరఫున డబ్బులు పంపిణీ చేస్తుండగా పట్టుకున్నారు. మద్యం, వస్తువులను, నగదు స్వాధీనం చేసుకొని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు సమాచారం.

ఆర్మూర్‌లో అల్ప్రాజోలం..

ఆర్మూర్ టౌన్: పట్టణంలోని మహాలక్ష్మి కాలనీలో తెలంగాణ నార్కోటిక్, పోలీసు శాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహిచి 500 గ్రాముల అల్ప్రాజోలం పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు. ఈ మహాలక్ష్మి కాలనీలో ప్రణీత్ ఇంట్లో దాడులు నిర్వహించగా సుమారు 3 లక్షల విలువైన 500 గ్రాముల అల్ప్రాజోలం పట్టుకొని, ప్రణీత్‌తో పాటు అశోక్ అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ప్రమాదవశాత్తు గుడిసె దగ్ధం

గాంధారి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని చద్మల్‌లో ప్రమాదవశాత్తు నివాసపు గుడిసె దగ్ధమైనట్లు బాధితురాలు మరాటి రోజా బుధవారం తెలిపారు. మరాటి రోజా ఉదయం దీపం వెలిగించి మండలకేంద్రానికి పనిమీద వెళ్లింది. గుడిసెలో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. ఈ విషయాన్ని గ్రామస్థులు రోజాకు సమాచారం ఇవ్వడంతో ఇంటికి చేరుకొని చూసేసరికి గుడిసె పూర్తిగా దగ్ధమైంది. గుడిసెలో సిలిండర్ ఉండటంతో ఆస్తినష్టం ఎక్కువగా జరిగిందని ఈ ప్రమాదంలో బంగారం, వెండితో పాటుగా నగదు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయని బాధితురాలు వాపోయారు. ఆర్ఐ ప్రదీప్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు.


కమ్మర్‌పల్లిలోని బీసీ బాలుర వసతి గృహం


స్నానాల గదులు, మరుగుదొడ్ల ఇనుప తలుపులు మాయమైన దృశ్యం

సంక్షేమం దొంగలపాలు

» నిరుపయోగంగా కమ్మర్‌పల్లి బీసీ బాలుర వసతిగృహ భవనం
» తలుపులు, ఇతర సామగ్రి చోరీ
» పట్టింపులేని అధికారులు
» హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేసి సరిపెట్టిన వైనం

కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో లక్షలు వెచ్చించి నిర్మించిన బీసీ బాలుర వసతగృహం నిరుపయోగంగా మారింది. ఈ భవనం వృథాగా ఉండటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇక్కడి సామగ్రి దొంగతల పాలైంది. ఈ భవనాన్ని 2015లో షెడ్యూల్డ్ కులాల అభివద్ధి శాఖ నుంచి రూ.80 లక్షలతో పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోనే నిర్మించారు. విద్యార్థుల సంఖ్య తక్కువ ఉండటం, అదేసమయంలో మానాల గిరిజన ఆశ్రమ పాఠశాల మంజూరు కావడంతో గిరిజన గ్రామాల్లో వసతులు కలిగిన భవనం లేకపోవడం, నూతన భవన నిర్మాణం పూర్తికాలేదు. దీంతో ఈ భవనంలోనే మానాల ఆశ్రమ పాఠశాలను కొనసాగించారు. నూతన జిల్లాలు, మండలాల ఏర్పాటులో భాగంగా మానాల గ్రామాన్ని సిరిసిల్లా జిల్లా రుద్రంగి మండలానికి బదలాయించడంతో గిరిజన ఆశ్రమ పాఠశాలను అక్కడికి తరలించారు. 4 నెలల పాటు తాత్కాలికంగా కొనసాగించిన ఆశ్రమ పాఠశాల తరలించడంతో ఈ భవనంలో ఫర్నీచర్ పట్ల ఎవరికీ శ్రద్ధ లేకుండా పోయింది. దీంతో వసతిగృహంలోని తలుపులు, కిటికీలు. వాటి ఫ్రేమ్‌లతో సహా ఎత్తుకుపోయారు. భవనం ఆవరణలో ఉన్న 10 మరుగుదొడ్లు, 10 స్నానాల గదుల తలుపులు చోరీ చేశారు. విద్యుత్ పరికరాలు స్విచ్ బోర్డులు ధ్వంసం చేసి వైర్లు సైతం దొంగిలించారు. సంబంధిత శాఖ అధికారులు మాత్రం ఈ భవనం శాఖ పరిధిలో ఉందని, ఆక్రమిస్తే చర్యలు తీసుకుంటామని బోర్డుపై చేతులు దులుపుకొన్నారని స్థానికులు మండిపడుతున్నారు. **- కమ్మర్‌పల్లి**


నాలుగింటికి ఒకటే మిగిలిన కట్టె బీరువా

మక్కలు, సన్న వడ్ల డబ్బులెప్పుడు వేస్తరు..?

» యాసంగి సాగుకు ఇబ్బందులు పడుతున్నాం
» ప్రభుత్వం వెంటనే చెల్లించాలి
» కమ్మర్‌పల్లి రైతులు

కమ్మర్‌పల్లి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వం కొనుగోలు చేసిన మొక్కజొన్న, సన్నవడ్ల డబ్బులు 2నెలలు కావస్తున్నా రైతులు ఖాతాల్లో జమకాలేదని కమ్మర్‌పల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కమ్మర్‌పల్లిలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. వారంలోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమవుతాయని చెప్పినా ఇంకా పడలేదన్నారు. యాసంగి వ్యవసాయ పనులు కొనసాగుతున్న తరుణంలో రైతులకు తక్షణమే మొక్కజొన్న, సన్న వడ్ల డబ్బులతో పాటు బోనస్ జమచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతులు సంత రాజేశ్వర్, కొత్తపల్లి రఘు, బొడిగె రవి, గోపిడి చిన్నరాజన్న, కొమ్ముల రాజన్న, గంగారెడ్డి, బామని రాజన్న తదితరులు పాల్గొన్నారు.


కమ్మర్‌పల్లిలో సమావేశమైన రైతులు

బీజేపీ నుంచి బహిష్కరణ

కమ్మర్‌పల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బషీరాబాద్ గ్రామానికి చెందిన అవకడి గంగన్నను బీజేపీ నుంచి బహిష్కరిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు బద్దం రమేష్ రెడ్డి తెలిపారు. పార్టీ కార్యక్రమాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నందునే గంగన్న జిల్లా అధిష్ఠానం ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఓటర్లను ప్రభావితం చేయొద్దు

ఆలూర్:ఎన్నికల నియమావళి ఉల్లంఘించినా, ఓటర్లను ప్రభావితం చేసినా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో షైలారం గంగాధర్ హెచ్చరించారు. మండల కేంద్రంలో పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న సర్పంచ్, వార్డు అభ్యర్థులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు.


మహేష్‌కుమార్‌కు అవార్డు అందజేస్తున్న అధికారులు

మహేష్‌కు గ్లోబల్ ఐకాన్ అవార్డు

మోర్తాడ్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్‌పల్లికి చెందిన కుంబాల మహేష్‌కుమార్ గ్లోబల్ ఐకాన్ అవార్డు అందుకున్నారు. పేదలకు, అనాథలకు, నిరాశ్రయులకు, అభాగ్యులకు సేవలందిస్తూ సామాజిక సేవారంగంలో అత్యుత్తమ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఎందరో యువకులకు మహేష్‌కుమర్ ఆదర్శంగా నిలిచారని సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ ఒప్పుల విజయ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం హైదరబాద్‌లోని తెలంగాణ సరస్వత పరిషత్ కళాభవన్‌లో ఏపీజే అబ్దుల్ కలాం గ్లోబల్‌ఐకాన్ అవార్డును మహేష్‌కు ప్రదానం చేశారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు తమ ట్రస్టు ద్వారా నిర్వహిస్తామని మహేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎస్పీ సైదులు, నేషనల్ చీఫ్ జస్టిస్ రాజు, హైకోర్టు న్యాయవాది కడారి రమేష్, నేముల సంపత్, నిజామాబాద్ జిల్లా పీఆర్‌వో లింగం పాల్గొన్నారు.

అంకాపూర్‌లో విద్యార్థుల పర్యటన

ఆర్మూర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంకాపూర్‌ను బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం జగిత్యాల వ్యవసాయ కళాశాల విద్యార్థులు సందర్శించారు. విద్యార్థులు తమ క్షేత్ర ప్రదర్శనలో భాగంగా గ్రామంలో వివిధ పంటలను, నీటి పద్ధతులను పరిశీలించారు. పంటల దిగుబడి సాధించడానికి అవలంబిస్తున్న పద్ధతులను క్షేత్రస్థాయిలో రైతులను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సీడ్ ప్రాసెసింగ్ యూనిట్లను సందర్శించి విత్తనోత్పత్తి, ప్రాసెసింగ్ పద్ధతులను పరిశీలించారు. విద్యార్థులకు సీడ్ ప్రాసెసింగ్ యూనిట్ యజమాని రాజిరెడ్డి విద్యార్థులకు సీడ్ ప్రాసెసింగ్‌పై వివరించారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్షుడు కల్లెం నర్సారెడ్డి, రైతు సంఘం సభ్యులు కే.కే భాజన్న, అధ్యాపకులు డాక్టర్ సతీష్, శ్రీలత, అర్చన, విద్యార్థులు పాల్గొన్నారు.


అంకాపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న విద్యార్థులు


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

జక్రాన్‌పల్లి , డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్గుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం 1999- 2000 సంవత్సరంలో పదోతరగతి చదువుకున్న బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పూర్వ విద్యార్థులంతా ఒకేచోట సమావేశమై పాతజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువా, మెమొంటోలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు గురువుల ఆశీస్సులు తీసుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఒక్కొక్కరుగా తమ జీవిత అనుభవాలను పంచుకుంటూ తమతమ ఉద్యోగాల గురించి తెలియజేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో 50 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సంత మల్లన్న ఆలయంలో సీపీ పూజలు

వేల్పూర్ , డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోలోని అంక్సాపూర్ గ్రామ సంతమల్లన్న, పాదరస లింగేశ్వర ఆలయాలను బుధవారం సీపీ సాయిచైతన్య దర్శించుకున్నారు. మొదట గుట్టపైన ఉన్న సంతమల్లన్న ఆలయానికి వెళ్లి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పాదరస లింగేశ్వర ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ పూజారి జగపది మహారాజ్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయాల విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో సీపీని శాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి దైవచింతన ఉండాలన్నారు. ఆయన వెంట ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి, ఎస్సై సంజీవ్ తదితరులు ఉన్నారు.


సీపీ సాయిచైతన్యను సన్మానిస్తున్న వీడీసీ సభ్యులు


సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

పరిశుభ్రతపై అవగాహన కలిగి ఉండాలి

ఆర్మూర్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హౌజింగ్‌బోర్డు యూపీఎస్సీ సెంటర్‌లో వైద్యసిబ్బందికి ఆసుపత్రి ఆవరణ, పరిసరాల పరిశుభ్రతపై డీఎంహెచ్‌వో రాజశ్రీ అవగాహన కల్పించారు. బుధవారం యూపీహెచ్‌సీ సెంటర్‌లో ఏర్పాటుచేసిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని ఎన్‌హెచ్‌ఎం కాయకల్ప కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు. ఆసుపత్రి పరిశుభ్రత, కంట్రోల్ వెస్ట్ మేనేజ్‌మెంట్, హైజీన్ ప్రమోషన్‌పై డివిజన్‌లోని మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ సిబ్బందికి అవగాహన కల్పించారు. మధుమేహం, క్యాన్సర్ స్క్రీనింగ్ వంటి నాన్‌కమ్యునికేబుల్ వ్యాధుల గురించి వివరించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీందర్, డా.అశోక్, డీఎస్‌వో నాగరాజు, శ్వేత, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రోగ్రాం ఆఫీసర్ డా.రాజు, డా.స్వామ్రట్‌యాదవ్ పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

» ఎన్నికల సామగ్రి పంపిణీ
» పోలింగ్ కేంద్రాలలో పూర్తి ఏర్పాట్లు

బోధన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని గ్రామాల్లో ఎన్నికల ఏర్పాట్లు పూర్తి స్థాయిలో సిద్ధం చేసినట్లు బోధన్ ఎంపీడీవో కిషోర్, తహసీల్దార్ విఠల్ వెల్లడించారు. బోధన్ మండలంలో 22 గ్రామ పంచాయతీ స్థానాలకు గాను 67మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉన్నారు. 194 వార్డు స్థానాలకు 280 మంది పోటీలో ఉన్నారు. మండల వ్యాప్తంగా 194 పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశారు. ఎన్నికల నిర్వహణకు పీఓఎస్ 194మంది, ఓపీఓఎస్ 245మంది, జోనల్ అధికారులు 4 మంది, మైక్రో అబ్జర్వర్ 8 మంది, సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన ఖండ్‌గావ్, కొప్పర్గ గ్రామాలలో ఇద్దరు వెబ్ కాస్టర్స్‌లను నియమించారు. 439 మంది ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

ఎన్నికల ఏర్పాట్లలో అధికారులు

సాలూర: మండలవ్యాప్తంగా ఎన్నికలకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ వెల్లడించారు. మండలంలో 9 గ్రామ పంచాయతీలలో 28 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉన్నారు. 72 వార్డు స్థానాలకు 153 వార్డుసభ్యులు పోటీలో ఉన్నారు. మండల వ్యాప్తంగా 88 పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశారు. ఎన్నికల నిర్వహణకు పీవోఎస్ 107 మంది, ఓపీవోఎస్ 138 మంది, జోనల్ అధికారులు ఇద్దరు, మైక్రో అబ్జర్వర్లు ఇద్దరు, సమస్యాత్మక గ్రామాలుగా గుర్తించిన సాలూర, జాడిజ మాల్‌పూర్ గ్రామాలలో ఇద్దరు వెబ్‌కాస్టర్స్‌లను నియమించారు. 245 మంది ఎన్నికల సిబ్బంది విధులు నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు.


సాలూరలో పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న దృశ్యం

పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు కల్పించాలి

సాలూర: ఎన్నికల కేంద్రాల వద్ద ఓటర్ల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లుచేయాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఎన్నికల అధికారులను ఆదేశించారు. ఎన్నికల సామగ్రి ఫైల్స్‌ను బుధవారం పరిశీలించారు. ఎంపీడీవో శ్రీనివాస్, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.


ఎన్నికల ఏర్పాట్లను పరిశీలిస్తున్న బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

కోటగిరి: బోధన్ డివిజన్‌లోని 11 మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందిగా నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో బుధవారం ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎన్నికల నిర్వహణలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో విష్ణు, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

పోతంగల్ మండలంలో..

పోతంగల్ మండలంలో ఎన్నికలకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బోధన్ డీఎల్‌పీవో నాగరాజు పేర్కొన్నారు. పోతంగల్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం ఎన్నికల సిబ్బందికి పలు సూచనలు అందజేశారు.


వర్నిలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

రెంజల్: మండలంలోని 17 గ్రామ పంచాయతీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి అధికారులు సామాగ్రిని పంపిణీ చేశారు. బస్సులు, ఇతర వాహనాలలో పోలింగ్ సిబ్బందిని వారికి కేటాయించిన కేంద్రాలకు తరలించారు. గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ కొనసాగనుంది. ఒంటి గంట వరకు పోలింగ్ కేంద్రాలలో క్యూలో ఉన్న ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఉంది. ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాలకు సామాగ్రిని పంపిణీ చేసి బందోబస్తు మధ్య పోలింగ్ సామాగ్రిని తరలించారు. సమస్యాత్మక గ్రామాలలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు పర్చామని శాంతియుతవాతావరణంలో ఎన్నికలు జరగా ఎస్ఐ చంద్రమోహన్ సూచించారు.

200 మంది సిబ్బందితో బందోబస్తు

నవీపేట: పోలింగ్ సందర్భంగా మండలంలో 200 మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఎన్నికల విధులకు వచ్చిన పోలీసులకు పలు సూచనలు అందజేశారు. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ తిరుపతి ఉన్నారు.


నవీపేటలో ఎన్నికల విధులకు వచ్చిన పోలీసు సిబ్బంది

నవీపేట మండలంలో 288 పోలింగ్ కేంద్రాలు

నవీపేట మండలంలో 288 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు ఎంపీడీవో నాగనాథ్ తెలిపారు. మండలంలో 32 గ్రామాలుండగా రెండు గ్రామాల్లో సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయన్నారు. మిగతావాటికి ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. దీనికి సంబంధించి 603మంది పీవో, ఓపీవోలను నియమించామని ఆయన వివరించారు.

● మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాన్ని బుధవారం అడిషనల్ కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, ఎంపీడీవో నాగనాథ్ ఉన్నారు.

వర్ని: మండల కేంద్రంలో బుధవారం జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణ రెడ్డి పర్యటించారు. గురువారం జరుగనున్న సర్పంచ్ ఎన్నికల ఏర్పాట్ల పై ఎన్నికల సిబ్బందితో మాట్లాడారు. పోలింగ్ ఏర్పాట్లపై సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల ప్రారంభం నుంచి ఓట్ల లెక్కింపు వరకు విధి విధానాలు పాటించాలని కలెక్టర్ సూచించారు.


రెంజల్‌లో ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రానికి తరలివచ్చిన సిబ్బంది

సర్పంచ్‌గా గెలిస్తే రికార్డే..


కన్నారెడ్డి గ్రామపంచాయతీ కార్యాలయం

నాగిరెడ్డిపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొత్తగా ఏర్పాటైన కన్నారెడ్డి, చిన్న ఆత్మకూర్ గ్రామ పంచాయతీల్లో తొలిసారి పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇంత కాలం ఈ గ్రామాలు ఇతర పంచాయతీ పరిధిలో ఉండేవి. ఇప్పుడు అవే పంచాయతీలుగా ఏర్పడడంతో తొలిసారి పంచాయతీ పోరుకు సిద్ధమయ్యాయి. రెండేళ్ల క్రితం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ గ్రామాలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశారు. ఇది వరకు కన్నారెడ్డి గ్రామం ధర్మారెడ్డి గ్రామ పంచాయతీ పరిధిలో ఉండగా, చిన్న ఆత్మకూర్ గ్రామం ఆత్మకూర్ పంచాయతీ పరిధిలో ఉండేది. ఈ గ్రామంలోని వ్యక్తికే సర్పంచ్‌గా ఎన్నుకునే అవకాశం రావడంతో గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎవరు గెలిచినా తొలి సర్పంచ్‌గా రికార్డ్ కొడతారు.

153 ఓట్లు సాధిస్తే సర్పంచే..

కన్నారెడ్డి సర్పంచ్ స్థానాన్ని ఎస్సీ జనరల్‌కు రిజర్వు చేశారు. ఈ గ్రామంలో 6 వార్డులున్నాయి. 305 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 134 మంది పురుషులు, 171 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. ప్రస్తుతం సర్పంచ్ స్థానానికి గ్రామానికి చెందిన దండు సాయిలు, పొమ్మగళ్ల సాయిలు ఇద్దరు బరిలో ఉన్నారు. చిన్న పంచాయతీ కావడంతో 153 ఓట్లు సాధించిన వ్యక్తి ఈ గ్రామ సర్పంచ్‌గా ఎన్నిక కానున్నారు.

చిన్న ఆత్మకూర్‌లో ముగ్గురు..

చిన్న ఆత్మకూర్ సర్పంచ్ స్థానాన్ని ఎస్సీ మహిళకు రిజర్వు చేశారు. ఇక్కడ 8 వార్డు స్థానాలు, 620 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 289 పురుషులు, 331 మంది మహిళలు ఉన్నారు. సర్పంచ్ స్థానానికి మిద్దింటి అనిత, రేడ్ల బాగాని నాగమణి, పల్లె సంపూర్ణ పోటీ చేస్తున్నారు. 311 ఓట్లు సాధించిన అభ్యర్థి సర్పంచ్‌గా ఎన్నికవుతారు.

ఊరు పోరులో రె'బెల్స్'

- ప్రధాన పార్టీలకు తలనొప్పిగా మారిన వైనం
- ఫలితాలను తారుమారు చేసేలా ప్రణాళికలు
- అభ్యర్థుల గుండెల్లో గుబులు

బాన్సువాడటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పల్లె పోరులో 'రెబెల్స్' మోగుతున్నాయి. పార్టీ తరఫున ఉన్న అభ్యర్థులపై కొంతమంది వ్యక్తి గత బలం నిరూపించుకునేందుకైనటే మరికొంతమంది ప్రతీకార జ్వాలతో సర్పంచ్ పదవులకు నామినేషన్ వేశారు. గ్రామస్థుల మద్దతును కూడగట్టుకునేందుకు తమదైన రీతిలో ప్రచారం చేస్తున్నారు. ప్రధాన పార్టీలకు ఇప్పుడు తలనొప్పిగా మారిందని చెప్పవచ్చు. పంచాయతీ ఎన్నికలంటేనే వ్యక్తిగత బలం, స్థానిక సంబంధాలు, సామాజిక వర్గాల ఆధిపత్య పోరుతో కూడుకున్నది. ఈ పోరులో రాజకీయ పార్టీల తరఫున మద్దతు పొందిన అభ్యర్థులకు సొంత పార్టీ, సొంత వర్గం నుంచే రెబెల్స్ బెడద పట్టుకోవడం తలనొప్పిగా మారింది.

ఆధిపత్యం కోసం..

స్థానిక ఎన్నికల్లో రెబెల్స్ పుట్టుకకు ప్రధాన కారణం కేవలం టిక్కెట్టు నిరాకరణ మాత్రమే కాదు. ఇది గ్రామస్థాయిలో ఉన్న కుటుంబాల మధ్య వైరం, సామాజిక వర్గపోరా ఆధిపత్యపోరు, వ్యక్తిగత ప్రతీకార ప్రబలనే చెప్పవచ్చు. పార్టీ నాయకత్వం ఎవరికి మద్దతు ఇచ్చినా ఆ గ్రామంలో బలమైన పట్టున్న నాయకుడు అలిగి రెబెల్‌గా పోటీలో నిలబడితే ప్రధాన నాయకులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంటుంది. ప్రస్తుతం బాన్సువాడ మండలంలోని కొన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. గ్రామంలో పట్టు ఉండనుకున్న వారంతా సర్పంచ్ స్థానానికి నామినేషన్ వేశారు.

బాన్సువాడ మండలంలో..

మండలంలో మొత్తం 25 గ్రామాలున్నాయి. వాటిలో ఇప్పటికే కొన్నిచోట్ల ఏకగ్రీవమయ్యాయి. మరికొన్ని చోట్ల ప్రధాన పార్టీల అభ్యర్థులకు రెబెల్స్ బెడద పట్టుకుంది. ఈ ఎన్నికల్లో ఫలితాలను కేవలం పదులు, వందల ఓట్ల తేడాతోనే నిర్ణయమవుతాయి. ఇక్కడ మాత్రం రెబెల్స్ ప్రభావం చూపనున్నారనే చర్చలు వినిపిస్తున్నాయి. పార్టీ పెద్దల మద్దతు ఉన్నప్పటికీ గ్రామస్థాయిలో రెబెల్స్ ఓట్లు చీలుస్తారని, తద్వారా ఎన్నికల్లో ఓటమిని చవి చూస్తామేమోనని ఆందోళన చెందుతున్నారు. ఎలాగైనా రెబెల్స్‌ను సైలెంట్ చేయాలని అటు పార్టీ పెద్దలు, ఇటు గ్రామపెద్దలతో చర్చలు జరుపుతున్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి


మాట్లాడుతున్న సీఐ సత్యనారాయణ గౌడ్

భీమ్‌గల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించుకోవాలని భీమ్‌గల్ ఎంపీడీవో సంతోష్ కుమార్ సూచించారు. బుధవారం పట్టణ కేంద్రంలో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 17న తేదీన జరిగే పోలింగ్ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగుతుందని అన్నారు. కనుక ఓటర్లు ఈ సమయంలో ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలోనే కౌంటింగ్ కొనసాగుతుందని. అదే రోజు నూతనంగా ఎన్నికైన సర్పంచ్, వార్డు సభ్యులు రిటర్నింగ్ అధికారుల సమక్షంలో ఉప సర్పంచ్ ఎన్నిక కూడా జరుగుతుందని తెలిపారు. అనంతరం సీఐ సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ.. అభ్యర్థులు, ప్రజలు ఎల్లలకు కట్టుబడి ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసి నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామన్నారు. అల్లర్లకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మహమ్మద్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

వణికించే చలిలో.. సిరులిచ్చే కంది

- కంది పంటకు కలిసివస్తున్న చలి
- దిగుబడులు పెరుగుతాయని ఆశలు
- ఆనందంలో అన్నదాతలు

జుక్కల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులు నల్లరేగడి భూము ల్లో కంది పంట సాగుచేశారు. ప్రస్తుతం సీజన్లో చలి ఎక్కువగా ఉండడంతో కంది పంట తంగేడి పూత మాదిరిగా అధికంగా పూత రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రబీ సీజన్‌లో సాగవుతున్న కంది, శనగ పంటలకు చలి విపరీతంగా ఉండడంతో పూత అధికంగా వచ్చి ఖాతికాస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా చలి ఎక్కువగా ఎక్కు వగా ఉండడంతో పంటకు చీడపురుగుల ప్రభావం తక్కువగా ఉంటుంది. పురుగు మందుల పిచికారీ అవసరం లేదు. రైతులకు తక్కువ పెట్టుబడితో పెట్టి ఎక్కువ లాభాలు పొందవచ్చని రైతులు చర్చించుకుంటు న్నారు. రైతులు సాగుచేసిన కంది పంట ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఈ సారి మార్కెట్లో ధర క్వింటాలుకు పదివేల రూపాయలు ఉండవ చ్చని రైతులు పదివేల రూపాయలు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. రానున్న రోజుల్లో చలి ఎక్కువగా ఉంటే దిగుబడి అధికంగా ఉంటుందని, పంట పుష్కలంగా పడుతుందని గ్రామీణ ప్రాంతంలో రైతులు చర్చించుకుంటున్నారు.


జుక్కల్ మండలకేంద్రంలో సాగవుతున్న కంది పంట

తక్కువ పెట్టుబడితో లాభాలు



ప్రస్తుత సీజన్‌లో చలి ఎక్కువగా ఉండడంతో కంది పంటకు పూత అధికంగా వచ్చింది. చలి ప్రభావంతో చీడపురుగుల ప్రభావం తక్కువ. తక్కువ పెట్టుబడితో కంది సాగుచేసిన రైతులు ఎక్కువ లాభాలు పొందుతారు. ఎకరం పంటకు రూ.80 వేల ఆదాయం రావొచ్చు.

- హన్మాండ్లు, రైతు, లాడేగాం

5వేల ఎకరాల్లో సాగు



జుక్కల్ మండల వ్యాప్తంగా రైతులు సుమారు ఐదువేల ఎకరాల్లో కంది పంట సాగుచేశారు. అయితే ఈ సీజన్‌లో చలి ఎక్కువగా ఉండటంతో పంటకు చీడ పురుగుల ప్రభావం ఉండదు. రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందవచ్చు.

- మహేశ్వరి, ఏవో, జుక్కల్

యువగళం

ఓటు వజ్రాయుధం లాంటిది



సర్పంచ్ ఎన్నికల్లో నా మొదటి ఓటును వేయడం సంతోషంగా ఉంది. నా ఓటును గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసే వ్యక్తికే వేయాలని నిర్ణయించుకున్నా. ఓటర్లు మద్యానికి, డబ్బులకు లొంగి ఓటేయవద్దని, ఓటు అనేది వజ్రాయుధం లాంటిది, ప్రలోభాలకు లొంగకుండా ఓటేసి గెలిపించుకోవాలి.

- నాగర్ల రిషివర్ధన్, రామేశ్వర్‌పల్లి

చాలా సంతోషంగా ఉంది



సర్పంచ్ ఎన్నికల్లో బాగంగా బిక్కనూరులో సర్పంచ్‌గా పోటీ చేస్తున్న అభ్యర్థుల్లో నిజాయితీగల అభ్యర్థికి నా మొదటి ఓటును వేస్తాను. మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకోవడం సంతోషంగా ఉంది. మంచి నాయకుడిని ఎన్నుకున్నప్పుడే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుంది. ఎవరు కూడా ప్రలోభాలకు లొంగిపోకూడదు.

- గౌరిశెట్టి రేవంత్, భిక్కనూరు

అభివృద్ధి చేసేవారికి ఓటేస్తా



మొదటి సారి నాకు ఓటు హక్కు రావడం ఆనందంగా ఉంది. హైదరాబాద్‌లో బీటెక్ సెకండియర్ చదువుతున్నాను. తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకుంటాను. నిజాయితీగా ఉండి, గ్రామాన్ని అభివృద్ధి చేసేవారికి ఓటు వేస్తాను. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా అభివృద్ధి చేసేవారిని ఎన్నుకోవాలి. మంచి నాయకుడిని ఎన్నుకున్నప్పుడే గ్రామంలో నెలకొన్న సమస్యలతో పాటు అభివృద్ధి సాధ్యమవుతుంది.

- కర్రోల్ల శరత్ గౌడ్, దోమకొండ

పండగ సాయన్న వర్ధంతి

కామారెడ్డిటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని బీసీ వసతి గృహంలో పండగ సాయన్న వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బుధవారం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు మాట్లాడుతూ.. బహుజన రాజ్యాధికారమే ధ్యేయంగా పోరాటం చేసిన యోధుడు సాయన్న అని అన్నారు. ప్రజలను దోచుకుంటున్న దొరల, దేశ్‌ముఖ్‌ల ఆస్తులను తీసుకొని ఇవ్వకుండా దోచుకొని పేదలకు పంచడని తెలిపారు. పండగ సాయన్న వీరత్వాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. టీబీఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌యాదవ్, జిల్లా కార్యదర్శి ప్రశాంత్, శివ, రహుల్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చైతన్యజ్యోతి రథయాత్ర

బాన్సువాడటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సర్వత్ర పిరమిడ్ సుభాష్ పత్రీజీ చైతన్యజ్యోతి రథయాత్రను గురువారం బాన్సువాడ పట్టణంలోని శ్రీ హనుమాన్ వ్యాయామశాల నుంచి ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు. పిరమిడ్ మాస్టర్లు అధికసంఖ్యలో విచ్చేసి యాత్రలో పాల్గొనాలని కోరారు.

13 సర్పంచ్ స్థానాలకు 37 మంది పోటీ

బీర్కూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలంలో 13 గ్రామ పంచాయతీలు ఉండగా మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తయింది. బరిలో నిలిచిన సర్పంచ్, వార్డు అభ్యర్థులకు ఎన్నికల అధికారులు గుర్తులను కేటాయించారు. 13 సర్పంచ్ స్థానాలకు 37 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 105 వార్డుస్థానాలకు 224 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. గుర్తుల కేటాయింపుతో గ్రామాల్లో ఒక్కసారిగా రాజకీయ వాతావరణం వేడెక్కింది. అభ్యర్థులు ఇంటింటికి తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. అయితే మండలంలోని బీర్కూర్ తండాలో మాత్రమే సర్పంచ్, వార్డు స్థానాలకు ఏకగ్రీవమయ్యాయి. 17వ తేదీన ఎన్నికలు జరుగనున్నాయి.

అన్నప్రసాద వితరణ..

గాంధారి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని తమ్మనంపల్లి గడలూరులో అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడానికి గాంధారి మండల కేంద్రం నుంచి బుధవారం శ్రీశాస్త్ర అన్నప్రసాద సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో బియ్యం, వంట సామాగ్రిని ప్రత్యేక వాహనంలో తరలించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ మధుసూదనానంద సరస్వతీ స్వామిజీ మాట్లాడుతూ.. శబరిమలైకి వెళ్లే అయ్యప్పస్వాములకు తమిళనాడులోని తమ్మనంపల్లి గడలూరులో ఈ నెల 15వ తేదీ నుంచి జనవరి 15వ తేదీ వరకు శ్రీ శాస్త్ర అన్నప్రసాద సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అయ్యప్పస్వాములు అంజాగౌడ్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

నిత్యవసర సరకుల పంపిణీ

కామారెడ్డి టౌన్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వీక్లీ మార్కెట్ ప్రాంతంలో గల సర్వేనెంబర్ 6లో ఇటీవల మున్సిపల్ అధికారులు తొలగించిన గుడిసెలలో నివాసం ఉండే వారికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి నిత్యవసర సరకులు పంపిణీ చేశారు. 20 ఏళ్లుగా రేకుల షెడ్డు వేసుకొని నివసిస్తున్న పేద కుటుంబాలకు చెందిన వారి గుడిసెలు, షెడ్లను కూల్చివేయడంతో వారు రోడ్డున పాలయ్యారని అన్నారు. వారికి మానవతాదృక్పథంతో సరుకులు అందించామని తెలిపారు. కార్యక్రమంలో నిమ్మ విజయకుమా ర్ రెడ్డి, పంపరి శ్రీనివాస్, జూలూరు సుధాకర్, చాట్ల వంశీ, సలీం, శంకర్రావు, గడ్డమీది మహేష్, మామిళ్ల రమేష్, రంగ రమేష్, నర్సిల్ల మహేష్, బల్ల శ్రీనివాస్, కోటి,వండ శ్రీకాంత్, ఆకాష్ పాల్గొన్నారు.



సరకులు పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్ రెడ్డి

పిట్లంలో అయ్యప్ప ఆరట్టు వేడుకలు


అయ్యప్ప స్వాముల ఆరట్టు ఉత్సవ వేడుకలు

పిట్లం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం అయ్యప్ప స్వామి ఆరట్టు ఉత్సవం కనుల పండువగా సాగింది. స్వాములు అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహానికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అనంతరం రథంపై కూర్చోబెట్టి ప్రధాన వీధుల గుండా ఊరేగింపు కార్యక్రమం చేపట్టారు. అయ్యప్ప స్వాముల భక్తి పాటలతో రథయాత్ర ముందుకు సాగింది. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

చురుగ్గా రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు

నవీపేట,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫకీరాబాద్ సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. బోధన్ నుండి బైంసా వరకు కొనసాగుతున్న 161బీబీ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్ సమీపంలో రైలు పట్టాల మీదుగా ఓవర్ బ్రిడ్జి పనులు చేపడుతున్నారు. దీనికి సంబంధించి బ్రిడ్జికి ఇరువైపులా రోడ్డు బ్రిడ్జి పనులు సైతం కొనసాగుతున్నాయి.



ఫకీరాబాద్‌లో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్న దృశ్యం

పంచాయతీల్లో ఎమ్మెల్యే ప్రచారం

పిట్లం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల సందర్భంగా బుధవారం పిట్లం మండలం బొల్లక్ పల్లి, మద్దెల చెరువు, బండపల్లి, గౌరారం, రాంపూర్, సిద్ధాపూర్, కుర్తి, అన్నారం, తదితర గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థుల తరఫున జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ సర్పంచ్‌గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలిస్తే గ్రామం మరింత వేగంగా అభివృద్ధి సాధిస్తుందని అన్నారు. గత 15ఏళ్లుగా ఎమ్మెల్యేగా పనిచేసిన హన్మంత్ షిండే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. గ్రామాల్లో అభివృద్ధి కొనసాగాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. అభివృద్ధి చేసే నాయకుడినే ఎన్నుకోవాలన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.పార్టీ సీనియర్ నాయకులు రాంరెడ్డి, మాజీ సర్పంచ్ వసంత శ్రీరాములు, బలరాంరెడ్డి, విండో చైర్మన్ శపథరెడ్డి పాల్గొన్నారు.

పోస్టల్‌బ్యాలెట్ పోలింగ్


ఓటు వేస్తున్న ఉద్యోగిని..

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల కోసం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటుచేసిన పోస్టల్ బ్యాలెట్‌లో బుధవారం ఉద్యోగులు ఓట్లు వేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో తాహెరాబేగం మాట్లాడుతూ.. రెండవ రోజు కూడా ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారని అన్నారు. ఓటు హక్కు వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఈ నెల 12లోపు మిగిలిన ఉద్యోగులు ఈ పోస్టల్ బ్యాలెట్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పేదల సంక్షేమం కోసం జీవిత బీమా

- తపాలాశాఖ సీనియర్ సూపరింటెండెంట్ జనార్దన్ రెడ్డి

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం తపాలాశాఖ 1995 నుంచి గ్రామీణ తపాలా జీవిత బీమాను ప్రారంభించిందని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా తపాల శాఖ సీనియర్ సూపరింటెండెంట్ జనార్దన్ రెడ్డి జరిగిందన్నారు. ఎల్లారెడ్డి మండల పరిధిలోని గండి మాసాయిపేట్, కల్యాణి గ్రామాల్లో బుధవారం తపాలాశాఖ సేవలపై గ్రామీణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తపాలాశాఖ గ్రామీణ సురక్ష, గ్రామ సంతోష్, గ్రామ సువిధ, గ్రామ సుమంగల్, గ్రామ ప్రియ, బాలజీవన్ బీమా పథకాలను ప్రవేశపెట్టి తక్కువ ప్రీమియంతో అధిక బోనస్ అందిస్తున్నాం. తక్కువ ప్రీమియంతో ఖాతాదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎంవో మహబూబ్‌రెడ్డి, బీపీఎం ప్రజ్ఞ, చందర్‌నాయక్, శ్యాంరావు, స్నేహా, భరత్, అబ్బుల్, గ్రామప్రజలు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సూపరింటెండెంట్ జనార్దన్‌రెడ్డి

ఓట్ల పండక్కి.. పల్లెలు ముస్తాబు

- ఓటరు గడపలో అభ్యర్థుల సందడి
- 3వ విడతలో బాన్సువాడ ఎన్నికలు

బాన్సువాడటౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నగారా మోగడంతో ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో ఒక్కసారిగా సందడిగా మారింది. ఏ పల్లె చూసినా ఎన్నికల పండుగ ఉత్సాహంతో కనిపిస్తుంది. తమ గ్రామాన్ని తమను పాలించే వ్యక్తిని ఎన్నుకునేందుకు పల్లె ప్రజలు కంకణం కట్టుకున్నారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు గెలుపు గుర్రాలను ఎంపిక చేసి సర్పంచ్ బరిలో ఉంచారు. ఇక కొంతమంది ఆశావహులు పార్టీ పెద్దల నిర్ణయాలను వ్యతిరేకించి పోటీలో ఉండి పార్టీ నుంచి గ్రీన్‌సిగ్నల్ రాకపోయినా ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేయడానికి సై అంటున్నారు.

ఓటరు గడపలో అభ్యర్థుల సందడి..

పార్టీలతో సంబంధం లేకుండా సర్పంచ్ బరిలో అభ్యర్థులు నిత్యం ఓటర్లను కలుస్తూ సందడి చేస్తున్నారు. ప్రచారంలో నిమగ్నమయ్యారు.

బాన్సువాడ మండలంలో ఓటర్ల వివరాలు..

బాన్సువాడ మండలంలో మొత్తం 25 గ్రామ పంచాయతీలు, 222 వార్డులున్నాయి. మొత్తం 29455 ఓటర్లు ఉండగా అందులో 14109 పురుషులు, 15344 మహిళా ఓటర్లు ఉన్నారు.

10 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం....

బాన్సువాడ మండలంలో 10 సర్పంచ్ స్థానాలు, 9 ఉపసర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమైనట్లు అధికారులు తెలిపారు. పోచారం, రాంపూర్ తాండా, చిన్నరాంపూర్, ఫులికుచ్చతాండా, ఇబ్రహీంపేట్ తాండా, జక్కల్‌దాని తాండా, బోర్లం క్యాంపు, సోమ్లా నాయక్‌తాండా, కొయ్యగుట్ట తాండా, పలిగుండ తాండాల సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి.


ఓట్ల పండగకు తరలివస్తున్న ప్రజలు

3వ విడతలో బాన్సువాడ గ్రామ ఎన్నికలు

మొత్తానికి పల్లెలో ఎన్నికల సందడికొంది. పంచాయతీ ఎన్నికలు 3 దశల్లో నిర్వహిస్తుండగా బాన్సువాడ ఎన్నికలు ఈ నెల 17న మూడవ దశలో జరుగనున్నాయి. గెలుపు గుర్రం ఎవ్వరో తెలియాలంటే ఎన్నికల ఫలితాల వరకు వేచి చూడాల్సిందే.

హలో తమ్మీ.. 'గుర్తు'ంచుకో..!

- అభ్యర్థుల మంతనాలు
- యువ ఓటర్ల పైనే ఆశలు

కామారెడ్డి రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏం తమ్మి అంతా మంచిదేనా.. కుటుంబం అంతా బాగున్నారా.. ఈ మధ్య ఊరికి వచ్చిందే బందజేసినవ్.. ఓటేసేందుకు తప్పక రావాలి.. నేను పలానా గుర్తుకు నిలబడినా.. అంటూ కొందరు సర్పంచ్ అభ్యర్థులు కలిపించిన యువకులతో మాట్లాడుతూ.. ఓట్లను అభ్యర్థిస్తున్నారు. మరోవైపు ఫోన్ల ద్వారా సంప్రదిస్తున్నారు. ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని ఓట్లు అభ్యర్థిస్తున్నారు. జిల్లాలో మొదటి విడత జరిగే పంచాయతీ ఎన్నికల్లో భాగంగా కామారెడ్డి డివిజన్‌లో మంగళవారంతో ప్రచారం ముగిసింది. దీంతో ప్రచారం జోరందుకుంది. ఓటింగ్‌కు ఒక్క రోజు సమయం ఉండటంతో ముమ్మరంగా గుట్టు చప్పుడు కాకుండా ఫోన్లలో పలానా గుర్తుకు ఓటేయాలని స్టేటస్‌లు పెడుతూ బంధువులు, స్నేహితులతో సైతం స్టేటస్‌లు పెట్టిస్తుండటం గమనార్హం.

జర ఓటేయమని చెప్పవా ..

బాపు కొడుకకు ఫోన్ చేసినా ఎత్తడం లేదు. జర ఫోన్ చేసినప్పుడు ఓటేయమని చెప్పు. గెలుస్తే తప్పక ఏ సమస్య వచ్చినా తీరుస్తా అని చెబుతూ పట్టణంలోని యువకుల ఓట్ల కోసం బతిమాలుతున్నారు.

గెలిపిస్తే అభివృద్ధి చేస్తా...

● రాజంపేట సర్పంచ్ అభ్యర్థి అముదాల నాగరాజు



రాజంపేటలో సర్పంచ్ అభ్యర్థి నాగరాజు

రాజంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజంపేట గ్రామ సర్పంచ్‌గా తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని అభ్యర్థి అముదాల నాగరాజు ఓటర్లను కోరారు. పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఆయన ప్రచార సమయంలో గ్రామంలో ఇంటింటికి వెళ్లి కత్తెర గుర్తుకు ఓటు వేయలని అభ్యర్థించారు. గతంలో తాను గ్రామ సర్పంచ్‌గా చేసిన సందర్భంలో అనేక అభివృద్ధి పనులు చేశానని గుర్తుచేశారు. మళ్లీ సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామాన్ని మరిం త అభివృద్ధి చేస్తానని ఓటర్లను కోరారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానన్నారు. పది సంవత్సరాలుగా గ్రామ సేవకుడిగా పలు పనులు చేయడంతో పాటు అభివృద్ధి చేసి ప్రతి కుటుంబ కష్టాల్లో నిలబడుతూ ఆర్థిక సహాయం అందజేశానన్నారు. రాబోయే రోజుల్లో గ్రామంలో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తూ యువతకి, గ్రామ ప్రజలకు జవాబు దారిగా పని చేస్తానన్నారు. గురువారం జరిగే పోలింగ్‌లో కత్తెర గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

చిన్నరాంపూర్ ఏకగ్రీవం



మల్లుగొండకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న అధికారులు

బాన్సువాడ రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ మండలంలోని చిన్నరాంపూర్ గ్రామపంచాయతీ ఏక్రగీవమైంది. సర్పంచ్ పదవికి ఒకే ఒక నామినేషన్ దాఖలు కావడంతో బుధవారం కురుమ మల్లుగొండ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ధృవీకరణపత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా మల్లుగొండ మాట్లాడుతూ తనపై నమ్మకముంచిన రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులకు ముఖ్యంగా గ్రామస్థులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్ మోహన్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ హుండీ లెక్కింపు

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పెద్ద రాంమందిర్ అనుబంధ సంస్థ అయిన సారంగపూర్ హనుమాన్ దేవాలయ హుండీని బుధవారం లెక్కించారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిశీలకురాలు కమల పర్యవేక్షణలో సాగిన హుండీ లెక్కింపులో రూ.40,3 98 ఆదాయం సమకూరింది. ఆదాయంలో రూ. 36,850 నోట్ల రూపంలో రాగా, రూ.3,538 నాణెల రూపంలో వచ్చింది. హుండీ లెక్కింపులో ఆలయ అర్చకులు శ్రీరాందాసి శశికుమార్, ఆలయ ఫిట్ పర్సన్ వేణు, జూనియర్ అసిస్టెంట్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఓటింగ్‌కు 18 రకాల గుర్తింపు కార్డులు

సుభాష్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 11, 14, 17వ తేదీల్లో మూడు విడతల్లో జరగనున్న పోలింగ్‌లో ఓటర్లు 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైన చూపించి ఓటు హక్కు వినియోగించ్చుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, నిజామాబాద్ కలెక్టర్ టి.వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. ఆధార్‌కార్డు, జాతీయ గ్రామీణ ఉపాది హామీ జాబ్‌కార్డు, ఫొటోతో కూడిన పోస్టాఫీసు బ్యాంక్ పాస్‌బుక్, కార్మిక మంత్రిత్వశాఖ ఇచ్చిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు, ఫొటోతో కూడిన కుల ధ్రువీకరణ పత్రాలు, ఇండియన్ పాస్‌పోర్టు, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యూమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలచే జారీచేయబడిన ఉద్యోగ గుర్తింపు కార్డు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఇచ్చిన అధికారిక గుర్తింపుకార్డు, దివ్యాంగుల గుర్తింపు కార్డు, పట్టాదార్ పాస్‌పుస్తకం, రేషన్‌కార్డు, ఫొటోతో కూడిన ఆయుధ లైసెన్స్ పత్రం, ఫ్రీడమ్ ఫైటర్ ఐడీ కార్డు, ఆర్జీఐ ద్వారా జారీచేయబడిన ఎన్‌పీఆర్ స్మార్ట్‌కార్డు, ఎంపీలకు జారీచేయబడిన గుర్తింపు కార్డు వీటిలో ఏదైన ఒకటి చూపించి ఓటు వేయచ్చని కలెక్టర్ సూచించారు. ప్రతీఒక్కరు ఓటు హక్కు వినియోగించుకొని ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటాలని సూచించారు.

నారుమడి.. నేల ఒడి

రుద్రూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జిల్లాలో చలి తీవ్రత రోజు రోజుకు పెరుగుతోంది. వరి సాగు చేసే రైతులు నారుమడి యాజమాన్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రుద్రూర్ కేవీకే శాస్త్రవేత్తలు సూచించారు. ముఖ్యంగా వరి శాఖీయ దశ అనగా నారుమడి, పిలకలు వేసే దశలో చలి తీవ్రత ప్రభావం అధికంగా ఉంటుంది. సాధారణంగా వరి మొలకెత్తటానికి 25-45 డిగ్రీ సెంటీగ్రేడ్‌లు, మొక్కల ఎదుగుదలకు 25-35 డిగ్రీ సెంటీగ్రేడ్ మధ్య ఉష్ణోగ్రతలు ఉండటం చాలా మంచింది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా నమోదు అవుతున్న వాతావరణ పరిస్థితులను చూసుకున్నట్లయితే కనిష్ఠ ఉష్ణోగ్రతలో జిల్లాలను బట్టి 15 డిగ్రీ సెంటీగ్రేడ్‌ల కంటే గత వారం రోజులుగా 4-5డిగ్రీలు తక్కువగా నమోదు అవుతున్నాయి. కావున భూమిలోని పోషకాలు మొక్కకు అందక ఆకులు పసుపు రంగు మారి ఆ తర్వాత ఎండిపోతున్నాయి. రాత్రి ఉష్ణోగ్రతల్లో తగ్గుదల వలన వరినారు ఎదగదు. ఈ పరిస్థితులలో రైతులు వివిధ రకాల పురుగు, తెగుళ్ల మందులు పిచికారీ చేస్తున్నారు. ఇలా చేయడం వలన ఎలాంటి ప్రయోజనం ఉండదు. పైగా అలాగే సాగు ఖర్చు పెరుగుతుంది. నారు ఎర్ర బడటం అనేది ఎలాంటి పురుగులు, తెగుళ్ల ఆశించడం వల్ల కాదు ఈ సమస్య కొన్ని రోజులు మాత్రమే ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు కొద్దిగా పెరిగినట్లయితే వరినార్లు మళ్లీ సాధారణ స్థితికి వస్తాయి. చలి తీవ్రత ఎక్కువగా ఉంటే నారు సరిగ్గా ఎదగక ఎర్రబడి కొన్నిసార్లు చనిపోతుంది.

● చలి తీవ్రత ఎక్కువగా ఉన్నప్పుడు నారు మడిపై టార్పాలిన్, పాలిథిన్ షీట్ లేదా సంచులతో కుట్టిన పట్టాలను రాత్రి వేళల్లో కప్పి ఉంచి మరుసటి రోజు ఉదయాన్నే తీసివేయాలి. దీని వల్ల చలి ప్రభావం తక్కువగా ఉండి నారు త్వరగా పెరుగుతుంది.

పంచాయతీల్లో ఉపసర్పంచ్ కీలకమే!

(5వ పేజీ తరువాయి)

సాయంత్రంలోగా వెలువడతాయి. ఆ వెంటనే ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహిస్తారు. ఉప సర్పంచ్‌గా పోటీ చేసే వారు ముందుగా నామినేషన్‌లు దాఖలు చేయడం, వారిని వార్డు సభ్యుల్లో ఒకరు బలపరచడం వంటి తతంగం ముగిసిన తర్వాత ఎన్నికను నిర్వహిస్తారు. వార్డు సభ్యులు చేతులెత్తడం ద్వారా ఎంపికను నిర్వహిస్తారు. ఎవరికి అనుకూలంగా ఎక్కువ మంది వార్డు సభ్యులు చేతులెత్తితే ఆ అభ్యర్థి గెలిచినట్లు ప్రకటిస్తారు. ఒకవేళ ఇద్దరికి సమాన ఓట్లు వస్తే టాస్ ద్వారా గెలుపును నిర్ణయిస్తారు.

ఉపసర్పంచ్ అధికారాలు...

సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్‌కు కూడా విధులు, బాధ్యతలు ఉంటాయి. ఉపసర్పంచ్ గ్రామ పంచాయతీ సమావేశాల్లో పాల్గొనడం, సర్పంచ్‌కు సహాయం చేయడంతో పాటు సర్పంచ్ లేనప్పుడు సర్పంచ్ విధులను నిర్వహిస్తాడు. పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా జరిగేట్లు చూడడం, రోడ్లు, మురుగుకాలువలు, వంతెనల నిర్మాణం, నిర్వహణ వంటి ప్రజా పనులు సక్రమంగా జరుగుతున్నాయో లేదో పర్యవేక్షిస్తారు. గ్రామాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేయడం, వాటి నిర్వహణ బాధ్యతలను కూడా పర్యవేక్షిస్తారు. పంచాయతీకి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడంలో కీలకపాత్ర పోషిస్తాడు.

ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ విక్టర్



సమావేశానికి హాజరైన పోలింగ్ సిబ్బంది

● అదనపు కలెక్టర్ విక్టర్
● భిక్కనూరులో ఎన్నికల సిబ్బందికి సామగ్రి అందజేత

భిక్కనూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): సర్పంచ్, వార్డుస్థానాలకు సంబంధించిన ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. భిక్కనూరు మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్నికల సిబ్బందికి సామాగ్రి అందజేత కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి బందోబస్తును ఏర్పాటు చేశామని భిక్కనూరు మండలంలో 582 మంది పోలింగ్ అధికారులు విధులు నిర్వహించారన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలున్నా అధికారులు వెంటనే తెలియజేయాలన్నారు. ఓటర్లకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశామ న్నారు. ప్రతిఓటరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఓట్ల కౌంటింగ్ వద్ద ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు. కాగా మండలంలోని ఆయాగ్రామాలకు ఎన్నికల అధికారులు సామగ్రిని ప్రత్యేక వాహనాల్లో చేరుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అబ్జర్వర్ సత్యనారాయణ రెడ్డి, ఎంపీడీవో రాజ్‌కిరణ్‌రెడ్డి, తహసీల్దార్ సునీత, ఎం ఈవో రాజ్‌గంగారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

దోమకొండ(బీబీపేట) : దోమకొండ, బీబీపేట మండలాల్లోని అన్ని గ్రామాలకు సంబంధించి సర్పంచ్, వార్డుసభ్యుల ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవోలు ప్రవీణ్‌కుమార్, పూర్ణచంద్రోదయకుమార్ తెలిపారు. సిబ్బందికి దోమకొండ మండల పరిషత్ కార్యాలయంలో, బీబీపేట జిల్లా పరిషత్ పాఠశాలలో ఎన్నికల సామగ్రిని అందజేశారు. బీబీపేటలో ఏర్పాట్లను అదనపు కలెక్టర్ విక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో దోమకొండ మండల స్పెషల్ ఆఫీసర్ జ్యోతి, సీడీపీవో రోచిష్మా, ఏపీవో రజని, ఏపీఎం శ్రీనివాస్, ఎంఈవో విజయ్ కుమార్, దోమకొండ, బీబీపేట ఎస్సైలు ప్రభాకర్, విజయ్ పాల్గొన్నారు.

నేడు 120 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్‌కు సిద్ధం

కామారెడ్డిరూరల్ : కామారెడ్డి మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో నేడు గురువారం నిర్వహించే ఎన్నికలకు 120 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసినట్లు బుధవారం ఎంపీడీవో హెప్సిబా రాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో 14 గ్రామాల్లో నిర్వహించే ఎన్నికలకు 120 మంది ప్రిసైడింగ్ అధికారులు, 143 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహిస్తారని అన్నారు. సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నికలు నిర్వహించడానికి బ్యాలెట్ బాక్స్‌లు, బ్యాలెట్‌పేపర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో విధుల నిర్వహించే పోలింగ్ అధికారులకు అన్ని రకాల సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంఈవో ఎల్లయ్య, ఎన్నికల సిబ్బంది, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



దోమకొండలో పోలింగ్‌స్టేషన్‌లు కేటాయిస్తున్న అధికారులు



బీబీపేటలో సామాగ్రి తీసుకుంటున్న సిబ్బంది

రేపటి నుంచి ఎన్నికల ప్రచారం నిషేధం

- రెండో విడత పోలింగ్ నిబంధనల అమలు
- 44 గంటల సైలెన్స్ పీరియడ్
- నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు
- నిజామాబాద్ కలెక్టర్



పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు కలెక్టర్

సుభాష్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల 2వ విడత పోలింగ్ సందర్భంగా ప్రచార కార్యక్రమాలపై నిషేధం విధిస్తున్నట్లు కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికల రెండోవిడత పోలింగ్ ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం నియమావళిని అనుసరిస్తూ జిల్లాలో ఈ నెల 14న ఎన్నికలు జరుగనున్న ధర్పల్లి, డిచ్పల్లి, ఇందల్వా యి, మాక్లూర్, మోపాల్, నిజామాబాద్, సిరికొండ, జక్రాన్పల్లి మండలాల పరిధిలో ఈ నెల 12వ తేదీ సా యంత్రం 5.00 గంటల నుంచి ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులోకి వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికలు ముగిసేంత వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. 44 గంటల సైలెన్స్ పీరియడ్‌లో ఎవరూ ఎన్నికల ప్రచారం చేయరాదన్నారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ, ఎంసీసీ బృందాలు, పోలీసు అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కటుదిట్టమైన నిఘా కొనసాగించాలని పేర్కొన్నారు. ఆ మం డలాల్లో మద్యం షాపులను, కల్లు దుకాణాలను మూసి వేయాలని కలెక్టర్ ఆదేశించారు.

మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మూడో విడతలో ఎన్నికలు జరిగే మండ లాల పోలింగ్ సిబ్బంది సెకండ్ ర్యాండ మైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధి కారి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి, జనరల్ అబ్జర్వర్ శ్యాంప్రసాద్ లాల్ సమక్షంలో బుధవారం నిర్వహించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్ఐసీ హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండ మైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, అబ్జర్వర్ నిశితంగా పరిశీలించారు. ఏకగ్రీవం అయిన వాటిని మినహాయిస్తూ, ఎన్నికలు నిర్వ హించాల్సి ఉన్న మిగిలిన గ్రామ పంచాయతీలకు సంబంధించి ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు.

ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా నిర్వహించాలి

(5వ పేజీ తరువాయి)

ఉండేలా చూడాలన్నారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలన్నారు. తాగునీరు, లైటింగ్, పార్కింగ్ ప్రదేశాల్లో, తదితర ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, అడ్డంకి లేకుండా సాగేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు.

ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి

గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా మొదటి విడత సర్పంచ్, వార్డు స్థానాలకు గురువారం ఎన్నికలు జరగనున్నాయి. ఆయా మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీల్లో గల ఓటర్లు తమ విధిగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ ఆశీష్ స్వాంగాన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నా 1 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రభుత్వం జారీ చేసిన ఏదైన గుర్తింపు కార్డును చూపించాలన్నారు. ఆధార్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, ప్రభుత్వ సంస్థలు జారీ చేసిన గుర్తింపు కార్డులు చూపించవచ్చన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

రాజంపేట: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం కేంద్రంలోని ఏర్పాటు చేసిన ఎన్నికల డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతూ... ఎన్నికల్లో విధులు నిర్వహించే అధికారులు అప్రమత్తంగా ఉంటూ ఎన్నికలను సజావుగా నిర్వహించాలని సూచించారు. పోలింగ్ అధికారులకు ఇచ్చిన ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ పేపర్లను, పోలింగ్ బాక్సులను పరిశీలించారు. సిబ్బంది రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, వారికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నాం భోజనం కల్పించాలని, విద్యుత్ అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలన్నారు. ఏమైనా లోపాలు కనిపిస్తే వెంటనే తెలియజేయాలని, తాగునీరు, లైటింగ్, పార్కింగ్ ప్రదేశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, అడ్డంకి లేకుండా సాగేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బాలకృష్ణ, తహసిల్దార్ జానకి, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

నేడే పోలింగ్

(5వ పేజీ తరువాయి)

పడుతున్నారు. నేడు వీరందరి భవిత్యవం తేలనుంది. ఇందుకోసం 1,457 పో లింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ నిర్వహణకు 1,848 మంది ప్రిసైడింగ్ అధికారులను, 2,501 అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను నియమించా రు. ఈ మండలాల పరిధిలో మొత్తం 2,48,668 ఉండగా ఇందులో పురుషుల ఓట్లు 1,18,342 మంది ఉండగా మహిళ ఓట్లు 1,30,322 మంది, ఇతరులు నాలు గున్నాయి.

పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు

మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న పోలింగ్ కేంద్రాల వద్ద జిల్లా పోలీసు శాఖ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కు వినియోగించుకునేలా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఆందోళనలు జరగకుండా ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద భారీ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు.

మొదటి విడతలో 66 సమస్యాత్మకమైన, అతి సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. ఈ పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయనున్నారు. మొదటి విడతలో 54 రూట్లలో మొబైల్ పెట్రోలింగ్ బృందాలు పర్యవేక్షించనున్నాయి. 10 స్ట్రైకింగ్ ఫోర్స్ టీమ్‌లను, 3 స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందాలను ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో మైక్రో అబ్జర్వర్లతో సీసీ కెమెరాల నిఘా నిడలో పోలింగ్ సరళిని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పర్యవేక్షించనున్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్‌ను అమలులో ఉంచారు.

జిల్లాలో పెరుగుతున్న కడుపు కోతలు

(5వ పేజీ తరువాయి)

ఏదో కారణం చెప్పి సిజేరియన్ ఆపరేషన్ చేస్తున్నారు.

కాసుల కోసం కక్కుర్తి

ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు కాసుల కోసం కక్కుర్తి పడుతున్నాయి. స్థాయి పెద్దగా ఉన్న ఆసుపత్రిలో రూ.60వేల నుంచి రూ.70 వేల వరకు ఉండగా, చిన్నస్థాయి ఆసుపత్రుల్లో రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు వసూలు చేస్తున్నారు. మందులు, ల్యాబ్ ఫీజులు అదనంగా రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు తీసుకుంటున్నారు. కాసుల కోసం ఆలోచిస్తున్న వైద్యులు రెండు ప్రాణాలకు దీర్ఘకాలికంగా ముప్పు కలిగిస్తున్నామని ఆలోచన చేయడం లేదు. సిజేరియన్లు చేయడం వల్ల మహిళల్లో పలు రకాల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశముందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. నార్మల్ డెలివరీల్లో పుట్టే చిన్నారుల కంటే సిజేరియన్లలో పుట్టే చిన్నారులకు అనేక రకాలైన సమస్యలు ఏర్పడుతాయని అంటున్నారు. అదేవిధంగా శస్త్ర చికిత్స జరిగేప్పుడు రక్తం ఎక్కువగా పోవడం వల్ల మహిళలకు ఆరోగ్యం విషయంలో ఇబ్బందులు ఏర్పడమే కాకుండా సాధారణ ప్రసవం అయినవారితో పోలిస్తే ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాల్సి వస్తోంది. మత్తులో ఉండడం వల్ల పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు ఇవ్వలేకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. మహిళలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవలసి వస్తుందని నిపుణులు పేర్కొంటున్నారు.

అమలు కాని ఈబర్త్ పోర్టల్

ప్రైవేట్ ఆసుపత్రుల్లో సిజేరియన్ ఆపరేషన్లను నిరోధించేందుకు, నార్మల్ డెలివరీలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం బర్త్ పోర్టల్‌ను అమలులోకి తీసుకువచ్చింది. ఆసుపత్రిలో ప్రతిరోజూ జరిగే డెలివరీల వివరాలను ఎప్పటికప్పుడు ఈ పోర్టల్‌లో నమోదు చేయాలి. పుట్టిన బిడ్డ వివరాలు, ఆపరేషన్ ఎందుకు చేయాల్సి వచ్చింది. మాతా, శిశు మరణాలు వంటి అన్ని వివరాలు ఆ పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. కానీ జిల్లాలో అమలు కావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

దృష్టి సారించని వైద్య ఆరోగ్యశాఖ

సిజేరియన్ డెలివరీలపై జిల్లాలో పర్యవేక్షణ కొరవడింది. 80 నుంచి 100 శాతం సిజేరియన్‌లు చేస్తున్న తీరుపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో తనిఖీలు చేసి ఏ ఒక్క ఆసుపత్రిపై చర్యలు తీసుకున్న దాఖాలాలు చాలా ఏళ్లుగా లేవు. ఇప్పటికే సిజేరియన్‌లు ఎక్కువగా చేస్తున్న ఆయా ప్రైవేట్ ఆసుపత్రులకు రాష్ట్ర ప్రభుత్వం నోటీసులు జారీ చేసినా చర్యలు మాత్రం తీసుకోలేదు. ఇది ఇలాగే కొనసాగితే మాతాశిశు మరణాల రేటు పెరిగే అవకాశాలు లేకపోలేదనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

అవకాశం కల్పించండి.. అభివృద్ధి చేస్తా

● గాంధారి సర్పంచ్ అభ్యర్థి ఆకుల కల్పన చంద్రశేఖర్



ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గాంధారి, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): గాంధారి గ్రామాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని, ఒక్కసారి అవకాశం కల్పించండి అని గాంధారి సర్పంచ్ అభ్యర్థి ఆకుల కల్పన చంద్రశేఖర్ అన్నారు. బుధవారం గాంధారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృత ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే సహకారంతో గాంధారి గ్రామాన్ని అభివృద్ధి బాటలో తీర్చిదిద్దడమే తమ ముఖ్యకర్తవ్యమన్నారు. గ్రామంలో సీసీరోడ్లు, డ్రైనేజీలు, క్రీడాప్రాంగణంతో పాటు గ్రామంలో ఇల్లులేని వారికి ఎమ్మెల్యే సహకారంతో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తానన్నారు. సంగెం రేవు బ్రిడ్జిని ఎమ్మెల్యే సహకారంతో మంజూరు చేయిస్తానని అన్నారు. ప్రతిఒక్కరూ ఉంగరం గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని, కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి చేస్తానన్నారు. గాంధారి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కల్పనకు మద్దతుగా ఎమ్మెల్యే ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆకుల కల్పనను గెలిపిస్తే గాంధారిని అన్నిరకాలుగా అభివృద్ధి పరుస్తానని అన్నారు.

కోతులు, కుక్కల సమస్య పరిష్కరిస్తా

● సర్పంచ్ అభ్యర్థి కాశీఫ్ మోహీనొద్దీన్



సర్పంచ్ అభ్యర్థి కాశీఫ్ మోహీనొద్దీన్

లింగంపేట, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి) : లింగంపేట సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామంలో కోతుల సమస్యతో పాటు కుక్కల సమస్యను పరిష్కరిస్తానని కాశీఫ్ మోహినొద్దీన్ అన్నారు. ఆయన బుధవారం లింగంపేట మండల కేంద్రంలోని 14వార్డులలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలోని ప్రతీ వీధిలో పూర్తిస్థాయిలో సీసీ రోడ్లు, ప్రణాళికబద్ధమైన డ్రైనేజీ వ్యవస్థ, ఎల్ఈడీ స్ట్రీట్‌లైట్స్, యువతకు క్రీడామైదానం, ప్రతీ ఇంటికి శుద్ధిచేసిన మంచి నీటి సరఫరా, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దనే పెన్షన్ అందించే ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రతీ 100రోజులకు గ్రామాభివృద్ధిపై పూర్తిస్థాయి సమీక్ష, గ్రామ ప్రధాన వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి గ్రామాన్ని ఆదర్శగ్రామంగా తీర్చిదిద్దుతానని ఆయన తెలిపారు. ఉంగరం గుర్తుపై ఓటువేసి తనను గెలిపించాలని, గ్రామాభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. రెండు దశాబ్దాలుగా కుల, మతాలకు అతీతంగా గ్రామంలోని వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ప్రతీనెల పెన్షన్ అందిస్తూ, గుడి, బడి, రోడ్లు పునరుద్ధరించి, తాగునీటి కోసం సుమారు 100 వరకు బోరుబావులు తవ్వించి తాగునీటిని అందించిన నిస్వార్థసేవకుడు హైకోర్టు సీనియర్ న్యాయవాది మోహిన్ హైమద్ ఖాద్రీ వదిన కుమారుడే కాశీఫ్ మోహీనొద్దీన్.

మానవహక్కులు వ్యక్తి జీవితాన్ని గౌరవంగా, స్వేచ్ఛగా ఉంచుతాయి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ

(5వ పేజీ తరువాయి)

భయం లేని వాతావరణంలో గడపడానికి అవసరమైన హక్కుల సమాహారం అని తెలిపారు. ఈ హక్కులు కేవలం చట్టపరమైన రక్షణకోసం మాత్రమే కాకుండా, సమాజంలో పరస్పర గౌరవం, న్యాయం, సమానత్వం వంటి విలువలను పెంపొందించేందుకు కూడా అవసరమని వివరించారు. విద్యార్థులు చిన్న వయస్సులోనే మానవ హక్కుల ప్రాముఖ్యతను అర్థం చేసుకుని, సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కామారెడ్డి చేపడుతున్న సేవల గూర్చి బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సహాయం అందించడం, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో, స్కూళ్లు, కాలేజీల్లో న్యాయ అవగాహన శిబిరాలు నిర్వహించడం, లోక్ అదాలత్ వంటి పలు సేవల గురించి వివరించారు. అలాగే డ్రగ్స్, మత్తు పదార్థాల వల్ల బానిస కావడం వ్యక్తిగత ఆరోగ్యాన్ని మాత్రమే కాదు జీవితాన్నే ప్రమాదంలోకి నెడుతుందని అన్నారు. మత్తు పదార్థాలు యువతలో సామర్థ్యాన్ని దెబ్బతీసి, నేరాలకు దారితీసే పరిస్థితులు సృష్టిస్తాయని అన్నారు. పాఠశాలలు, కాలేజీలు డ్రగ్ ఫ్రీ క్యాంపస్‌గా ఉండటానికి అందరూ బాధ్యత వహించాలని తెలిపారు. మీ ఆరోగ్యం, మీ భవిష్యత్తు, మీ హక్కులు డ్రగ్స్ నుంచి దూరంగా ఉన్నప్పుడు మాత్రమే సురక్షితం అవుతాయి అని విద్యార్థులకు సూచించారు. రాగింగ్, బాల్య వివాహాలపై, బాల కార్మికుల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ మాయ సురేష్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ శ్రీనివాస్, ప్రిన్సిపాల్ గంగాధర్, హ్యూమన్ రైట్స్ హెల్ప్ అసోసియేషన్ మెంబెర్స్ జమున, భాగ్యలక్ష్మి, అనిత, రాములు, ప్రదీప్, లింగయ్య, యాదగిరి, భాస్కర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఇందూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యాసంవత్సరం ప్రారంభానికే ముందే కార్పొరేట్ విద్యాసంస్థలు విచ్చలవిడిగా అడ్మిషన్ ప్రక్రియను ప్రారంభిస్తున్నాయని, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా నాయకురాలు జ్వాలా డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని డీఈవో కార్యాలయంలో డీఈవో అశోక్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో మెరిట్ స్టూడెంట్‌ను టార్గెట్ చేసి ఫీజులో రాయితీ ఇస్తామని అడ్మిషన్‌లు చేసుకుంటున్నారన్నారు. ప్రైవేట్ స్కూళ్ల వద్ద కరపత్రాలు పంచుతూ ఫీజులో రాయితీలు ఇస్తామని చెబుతూ మోసం చేస్తున్నారన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- ఆంధ్రా కింగ్ తాలుకా
ప్రియ 35- రాజు వెడ్స్ రాంబాయి
దర్శన్- జటాధర

బాన్సువాడ

మహేశ్వరి	ఆంధ్రాకింగ్ తాలూకా
వెంకటేశ్వర	రాజు వెడ్స్ రాంబాయి

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230